క్లుప్తంగా

అభయాంజనేయ స్వామి విగ్రహ వార్షికోత్సవం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో 41అడుగుల కేస్లాపూర్ అభయాంజనేయ స్వామి భారీ విగ్రహ వార్షికోత్సవాన్ని ఈనెల 7న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు స్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ వార్షికోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ విద్యుత్ డివిజనల్ కార్యాలయ పరిధిలోని మండలాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కాగజ్‌నగర్ విద్యుత్‌శాఖ ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. సిర్పూర్ -టి, కౌటాల, బెజ్జూర్, దహెగాం, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో (కాగజ్‌నగర్ పట్టణం మినహా) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఈస్‌గాం132 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా అంతరాయం ఉంటుందన్నారు. విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కౌటాలలో..

కౌటాల: ఈజ్‌గాంలోని 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని పీటీఆర్ వర్క్స్, వీసీబీ, ఎల్‌వీ బ్రేకర్ల మరమ్మతులు ఉండడంతో నేడు మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రవీందర్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

భక్తిభావం అలవర్చుకోవాలి



ప్రవచనాలు బోధిస్తున్న స్వాములు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రతీ ఒక్కరు భక్తి మార్గం అలవర్చుకోవాలని నార నారాయణ నందగిరి, శివ నందగిరి స్వామి అన్నారు. ఆదివారం మండలంలోని మోతుగూడలో బ్రహ్మ నిష్ఠాశ్రమం వార్షికోత్సవం సందర్భంగా ఉదయం సుప్రభాతం, పతాక ఆవిష్కరణ, హోమం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వాములు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు భక్తి మార్గం ఎంచుకోవాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటాం



క్రీడాకారులకు వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై వెంకటేష్

బెజ్జూర్: క్రీడాకారులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని ఎస్సై వెంకటేష్ అన్నారు. ఆదివారం మండలంలోని సలుగుపెల్లి గ్రామంలో క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువకులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలతో స్నేహభావం పెంపొందడంతో పాటు శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కుర్సింగ ఓంప్రకాష్, బీఆర్‌ఎస్ నాయకులు దుర్గ గౌడ్, పర్ష శంకర్, ఏనుక శ్రీహరి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న కిజర్‌హుస్సేన్

సిర్పూర్(టి): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బెంగాలీక్యాంపు కాలనీలో బెంగాలీ క్యాంపు యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. అనంతరం గెలుపొందిన బెంగాలీ క్యాంపు టీంకు మొదటి బహుమతి రూ. 20వేల నగదు, ద్వితీయ బహుమతి పొందిన సిర్పూర్(టి) టీంకు రూ.10వేల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు దెబోత్ మేస్త్రీ, ఇఫాత్‌హుస్సేన్, మౌల్కర్ సంతోష్, నాయకులు కారం నాని, రాజేశ్వర్, కమిటీ సభ్యులు మనీశంకర్, దేవశిష్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా భత్యం.. అందని దైన్యం

- రెండేళ్లుగా ఇదే తంతు
- ఇంకా విడుదల చేయని ప్రభుత్వం
- విద్యార్థులకు తప్పని ఎదురుచూపులు
- రాకపోకలకు ఇబ్బందులు



కెరమెరి నుంచి కెలిబి, కెలికే గ్రామాలకు ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

కెరమెరి: గ్రామాలకు దూరంగా ఉన్న ప్రాంతాలకు బడికి వెళ్తున్న విద్యార్థులకు ఆర్థిక చేయూత అందించేందుకు రవాణా భత్యం ఇస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. దీంతో రెండేళ్లుగా విద్యార్థులకు రవాణా భత్యం అందక పేద, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం పడుతుంది. మండలంలో 56 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటిలో 3842 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో కెరమెరి, గోయగాం, ఝరి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు, మండలంలోని కొన్ని ప్రాథమికోన్నత పాఠశాలలకు వచ్చే విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి ప్రయాణం చేస్తున్న వారు గతేడాది 78 మంది ఉండగా, ఈ ఏడాది 116 మంది ఉన్నారు. వీరికి ప్రభుత్వం నుంచి రవాణా భత్యం రావాల్సి ఉంది. గతంలోనే అధికారులు విద్యార్థులకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు తెరిచిఖాతాల వివరాలు ఉన్నతాధికారులకు సమర్పించారు.

దూరాన్ని బట్టి భత్యం

విద్యార్థులు వెళ్లే దూరాన్ని బట్టి రవాణా భత్యం అందిస్తారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులు (1 నుంచి 5వ తరగతులు) కిలో మీటరు దూరం వరకు వెళ్లే వారికి నెలకు రూ.400 చొప్పున, 3 కిలోమీటర్ల దూరం నుంచి పాఠశాలలకు వస్తున్న 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.600 చొప్పున 10 నెలలకు సంబంధించిన భత్యం అందిస్తారు. కాగా బస్సు సౌకర్యం లేక విద్యార్థులు మూడు, నాలుగు కిలోమీటర్ల నుంచి కాలినడకన, సైకిళ్లపై, ఆటోల్లో పాఠశాలలకు వస్తున్నారు. చాలా చోట్ల బస్సులు సమయానికి రాక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా రవాణా భత్యం నిధులు మంజూరు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నివేదికలు సమర్పించాం

గతంలోనే అర్హులైన దూర ప్రాంతాలకు చెందిన విద్యార్థుల వివరాలు సేకరించాం. బ్యాంకుల్లో ఖాతాలు కూడా తెరిపించాం. వివరాలన్ని ప్రభుత్వానికి సమర్పించాం. త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. నిధులు మంజూరైతే విద్యార్థులు ఇచ్చిన ఖాతాల్లో రవాణా భత్యం జమ చేస్తాం.

– కుడ్మెత సుధాకర్, ఎంఈవో, కెరమెరి

'హరిత' సంకల్పానికి సిద్ధం

- మొక్కల పెంపకానికి నర్సరీల్లో కొనసాగుతున్న పనులు
- 2లక్షల మొక్కలు పెంచడమే టార్గెట్
- పర్యవేక్షిస్తున్న అధికారులు



దరోగపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కల పెంపకానికి అధికారులు శ్రీకారం చుట్టారు. మండలంలో నిర్వహించనున్న 8వ విడత హరితహారంలో 2లక్షల మొక్కలు నాటేందుకు అధికారులు నర్సరీలను సిద్ధం చేశారు. మండలంలో 12 గ్రామపంచాయతీలు ఉండగా వాటిలో ఉపాధిహామీ పథకంలో భాగంగా 12 నర్సరీలు ఏర్పాటు చేశారు. నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నారు.

సిద్ధమైన నర్సరీలు..

మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీల్లో ఇప్పటికే మొక్కలు పెంచడానికి బ్యాగుల్లో మట్టి నింపారు. నర్సరీల్లో కలుపు మొక్కలను నివారించటానికి కవర్లు కప్పి ఉంచారు. మరోవైపు పనులు పూర్తయిన నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు విత్తనాలు సైతం పంపిణీ చేశారు.

రకరకాల మొక్కలు..

గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాలు, రోడ్డుకు ఇరువైపుల, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మొక్కలు నాటడానికి అనువైన మొక్కలను పెంచుతున్నారు. టేకు, వేప, చింత, వెదురు, మునగ, మామిడి, జామ, మందార, గులాబితో పాటు అనేక రకాల పండ్ల మొక్కలను పెంచనున్నారు. నర్సరీల్లో వన సేవకులను ఏర్పాటు చేసిన అధికారులు నిత్యం నర్సరీలను సందర్శిస్తూ సిబ్బందికి తగు సూచనలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో మొక్కల పెంపకంలో చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ హరితహారం కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయటానికి కార్యాచరణ రూపొందించారు.

వేగంగా పనులు

మండలంలో 12 నర్సరీల్లో పనులు వేగంగా సాగుతున్నాయి. 2లక్షల మొక్కలను నాటడానికి లక్ష్యాన్ని నిర్దేశించాం. నర్సరీల్లో బ్యాగుల్లో ఇప్పటికే మట్టిని నింపడం పూర్తయింది. ప్రతీ వారం ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నాం. రానున్న ఎండాకాలంలో మొక్కలను సంరక్షించటానికి ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేయడంతో పాటు వన సేవలకు శిక్షణ ఇచ్చాం.

– గంగాసింగ్, ఎంపీడీవో, పెంచికల్‌పేట్

ఘనంగా సమ్మక్క-సారలమ్మ జాతర



ఆసిఫాబాద్‌రూరల్/చింతలమానెపల్లి: జిల్లా కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో, చింతలమానెపల్లి మండలంలోని డబ్బా గ్రామంలో ఆదివారం సమ్మక్క -సారలమ్మల జాతర ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం సారలమ్మ గద్దెపై పడిగిద్దరాజుతో సమ్మక్క కల్యాణం, సమ్మక్క తల్లి గద్దెపై ఆహ్వాన కార్యక్రమం నిర్వహించారు. జాతర సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి సమ్మక్క -సారలమ్మలకు బంగారం(బెల్లం) సమర్పించారు.

మంచెపై కాపలా..!



పెంచికల్‌పేట్: మండలంలో యాసంగిలో రైతులు సాగు చేస్తున్న జొన్న, పెసరు, కంది, శనగ పంటలను పక్షులు, కోతులు, అడవి పందుల బారి నుంచి కాపాడుకోవటానికి అన్నదాతలు శ్రమిస్తున్నారు. పంట చేన్లలో మంచెలు ఏర్పాటు చేసుకుని రాత్రి, పగలు అనే తేడా లేకుండా గస్తీ కాస్తూ పంటలను రక్షించుకుంటున్నారు.

పరిమళించిన మానవత్వం

తాండూర్: రోడ్డు ప్రమాదానికి గురై బలమైన గాయాలతో మంచం పట్టిన ఓ వ్యక్తికి చికిత్స కోసం మానవత్వంతో కొందరు యువకులు ఆర్థికసాయం అందించి ఉదారత చాటుకున్నారు. మండలకేంద్రంలోని ఐబీకి చెందిన ఓరుగంటి దిలీప్ అనే వ్యక్తి కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స చేయించుకోవడానికి ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్న ఆయనకు యువ భారత్ శక్తి ఫౌండేషన్ నిర్వాహకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సోషల్ మీడియా ద్వారా తోచిన రీతిలో విరాళాలు సేకరించారు. ఆ తీరుగా వసూలైన రూ.21వేలను ఆదివారం దిలీప్ ఇంటికి వెళ్లి యువభారత్ శక్తి ఫౌండేషన్ తాండూర్ మండల ఇన్‌చార్జి రోషన్, చౌటపల్లి ఇన్‌చార్జి రాకేష్, బోయపల్లి బోర్డు ఇన్‌చార్జి వెంకటేష్, జ్ఞానేశ్వర్ నగదు రూపంలో అందజేశారు. తనకు ఆర్థిక సాయం అందించిన ఫౌండేషన్ నిర్వాహకులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

అభ్యాస పాఠశాలకు బెస్ట్ ఎమర్జింగ్ స్కూల్ అవార్డు

మంచిర్యాలఅర్బన్: స్థానిక అభ్యాస పాఠశాలకు బెస్ట్ ఎమర్జింగ్ స్కూల్ ఆఫ్ ది ఇయర్ 2023అవార్డు లభించింది. బ్లూ బెర్రి ఇంటర్నేషనల్ గ్రూప్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రీనియర్‌షిప్, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ గవర్నర్‌మెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం అహ్మదాబాద్‌లో నిర్వహించిన టాప్ ఎడ్యుకేటర్స్ ఎక్సలెన్సీ అవార్డు 2023గాను ఈ అవార్డును అందుకున్నారు.



దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎస్పీ సురేష్‌కుమార్

అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

పాతమంచిర్యాల: అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి బోడ జనార్దన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం మాలమహానాడు క్యాలెండర్‌ను జిల్లా మాలమహానాడు నాయకులతో కలిసి ఆవిష్కరించారు. మాలలు ఐక్యంగా ఉండాలని, మాలబిడ్డలు ఉన్నత చదువులు చదవాలని, అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సొత్కు సంజీవరావు, మాలమహానాడు నాయకులు ముంత మాల పుల్లయ్య, తొగరు సుధాకర్, సుధమళ్ల హరికృష్ణ, జయరావు, మేకల సరోజ, చిప్పరి రాజమల్లయ్య, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

గంగాపూర్‌కు పోటెత్తిన భక్తజనం

గంగాపూర్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి అలయ జాతరలో భాగంగా ఆదివారం రథోత్సవం నిర్వహించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. స్వామి వారిని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్, జెడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి, జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్‌లు వేర్వేరుగా దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావటంతో రైల్వేగేట్ నుంచి ఆలయానికి వెళ్లే మార్గంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తి భారీగా వాహనాలు నిలిచిపోయాయి. మండల కేంద్రానికి చెందిన వర్తక వ్యాపారులు దాతల సహాయంతో మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ దండె విఠల్, ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ సంతోష్‌లు కార్యక్రమంలో పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు.

– రెబ్బెన



భక్తులకు అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్



స్వామి వారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి



జాతరలో భక్తుల సందడి



సెల్ఫీ దిగుతున్న యువతి



జాతరలో తినుబండారాలు కొనుగోలు చేస్తున్న భక్తులు



పల్లకి మోస్తున్న సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేశ్